క్లుప్తంగా

నేడు రేగోడ్‌కు త్రిష దామోదర్

రేగోడ్(మెదక్): మండలంలో ఆదివారం నిర్వహించే బతుకమ్మ సంబురాలకు త్రిష దామోదర్ రానున్నట్లు కో–ఆప్షన్ సభ్యుడు చోటుమియా, కాంగ్రెస్ పార్టీ రేగోడ్ గ్రామ అధ్యక్షుడు శంకరప్ప శనివారం తెలిపారు. రేగోడ్‌లో సాయంత్రం బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొంటారని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నోడల్ అధికారి నర్సింలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలోని 90, 91, 92, 93 పోలింగ్ కేంద్రాలను నోడల్ అధికారి నర్సింలు శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలవద్ద దివ్యాంగుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన ర్యాంప్ నిర్మాణాన్ని పరిశీలించారు. అలాగే విద్యుత్ సరఫరా, ఫ్యాన్, టాయిలెట్స్, తాగునీటి సౌకర్యాల తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఎక్కడైనా సమస్యలుంటే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, ఎల్లం, జగన్, ధాక్యనాయక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని బహిరన్‌దిబ్బ గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికులకు గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్ తన సొంత డబ్బులతో దసర పండగ సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే పంచాయతీ కార్మికుల శ్రమ ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రభు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీ ఇన్‌చార్జిల ఎంపిక



నియామక పత్రాలు అందుకుంటున్న ఇన్‌చార్జిలు

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం నర్సంపల్లిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సమావేశమై బూత్ కమిటీ ఇన్‌చార్జిలను ఎన్నుకున్నారు. గ్రామంలో మొత్తం 972 ఓట్లకు గాను ప్రతి 60 మందికి ఒకరి చొప్పున 16 మంది ఇన్‌చార్జిలను నియమించినట్లు సర్పంచ్ భారతమ్మ సత్తయ్య శనివారం పేర్కొన్నారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా సత్యం కొనసాగనున్నారు. ఈ కమిటీలో ఎంపికైనవారు తమ పరిధిలో ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసే విధంగా చైతన్యపర్చాలని ఆయన చెప్పారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందజేశారు. సర్పంచ్ భారతమ్మ, ఉప సర్పంచ్ ఫౌజియా ముస్తాక్, పార్టీ గ్రామ అధ్యక్షుడు లాలం, వార్డు సభ్యులు, బూత్ కమిటీ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

సొంతగూటికి భూమలింగంగౌడ్



బీఆర్ఎస్‌లో చేరుతున్న భూమలింగంగౌడ్

మెదక్: బీఆర్ఎస్‌లో బీసీలకు ప్రాధాన్యం దక్కడం లేదంటూ ఆ పార్టీకి రాజీనామా చేసిన తిగుల్ల భుమలింగంగౌడ్ తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమక్షంలో శనివారం పార్టీ కండువా కప్పుకున్నారు. చేగుంటకు చెందిన భూమలింగం గౌడ్ 2007 నుంచి బీఆర్ఎస్‌లో కొనసాగారు. సరైన గౌరవం దక్కడం లేదన్న అసంతృప్తితో దూరంగా ఉన్నారు. ఎవరూ పట్టించుకోక పోవడంతో గత నెల 13న బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. బీజేపీలో చేరాలని తనకు ఆహ్వానం అందుతుందని తెలిపారు. అంతలోనే మనసు మార్చుకున్న భూమలింగం గౌడ్ తిరిగి సొంత గూటికి చేరుకున్నారు.

ఊపందుకున్న వరి కోతలు

- కల్లాలకు చేరుతున్న ధాన్యం
- ఎన్నికల హడావుడిలో అధికారులు
- ధాన్యం కొనుగోళ్లపై రైతుల ఆందోళన



మిషన్ ద్వారా వరి కోత కోస్తున్న దృశ్యం



కొల్చారం(నర్సాపూర్): ఈ ఏడు మండల వ్యాప్తంగా రైతులు వరి అత్యధికంగా పండించారు. పంట కోతకు వాతావరణం కూడా పూర్తిగా అనుకూలించడంతో వరికోత పనులు ఊపందుకున్నాయి. దసరా తర్వాత పూర్తిస్థాయిలో వరి కోతకు రైతులు సన్నద్ధమయ్యారు. చాలా చోట్ల ఎప్పటిలాగే వరి కోత యంత్రాలను ఉపయోగించి పంట కోతను చేపట్టారు. ఈ నేపథ్యంలో ఒకేసారి ధాన్యం పెద్ద ఎత్తున కొనుగోలుకు రానుంది. ప్రస్తుతం ఎన్నికల సీజన్ నడుస్తుండడంతో ధాన్యం కొనుగోలపై దాని ప్రభావం ఉంటుందని, ఇబ్బందులు ఏర్పడవచ్చని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు ధాన్యం కొనుగోళ్లకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా.. ఎన్నికల విధుల్లో అధికారులు నిమగ్నమై ఉండడం, రైతుల ఆందోళన చెందడంలో నిజం లేకపోలేదన్నదానికి బలం చేకూరుతుంది. ఈ ఏడాది అత్యధికంగా వర్షాలు సకాలంలో కురవడం, చెరువులు కుంటలు నీటితో నిండడంతో పాటు 70 శాతం వరి పంట బోర్ల కింద సాగవ్వడం పంట దిగుబడి కూడా అత్యధిక స్థాయిలో వచ్చే అవకాశం ఉంది. గడిచిన రెండు సీజన్లలో వానాకాలం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం సరాసరి 48,330 మెట్రిక్ టన్నులు కాగా యాసంగి సీజన్‌లో 31,488 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 50 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలనే లక్ష్యంతో ఇప్పటికే అధికారులు సన్నద్ధమయ్యారు.

ధాన్యం కొనుగోలు..

ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు మండలంలోని 8 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, 3 ఐకేపీ, 2 రైతు సేవా కేంద్రాలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాయి. గడచిన సీజన్లో ధాన్యం కొనుగోలులో రైతులకు ఎప్పటిలాగే ఇబ్బందులు తప్పలేదు. ప్రధానంగా రైస్ మిల్లుల యజమానులు ప్రభుత్వం నిర్దేశించిన తూకానికి బస్తాకు 3 నుంచి 5 కిలోలు అధిక తూకం వేయడం, తూకం వేసిన ధాన్యం రవాణాకు ఇబ్బందులు తలెత్తడం వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించినా ఇబ్బందులు మాత్రం రైతులను వేధిస్తూనే వచ్చాయి.

మండలంలో వరుసగా మూడు సీజన్లలో వరి పంట సాగు వివరాలు....

ఏడాది	సీజన్	పంట సాగు (ఎకరాల్లో)
2022	వానాకాలం	19,332
2022–23	యాసంగి	17,978
2023	వానాకాలం	20,140

రైతులు నష్టపోకుండా చూడాలి..



కష్టించి పండించిన పంటను ఎప్పుడు అమ్ముకుందామన్నా ఏదో రకంగా ఇబ్బందులు తలెత్తుతూనే వస్తున్నాయి. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో ధాన్యం కొనుగోళ్లపై అధికారుల పర్యవేక్షణ ఎంత ఉంటుందో తెలియదు. లేదంటే మునుపటి కంటే ఈసారి ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

– లాల్ సింగ్, రైతు, సీతారాం తండా

రైతులకు పూర్తి సహకారం..



ధాన్యం కొనుగోళ్లపై ఇప్పటికే సంబంధిత కొనుగోలు కేంద్రాల సిబ్బందికి పూర్తిస్థాయిలో సూచనలు ఇచ్చాం. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావలసిన అవసరం లేదు. పంట ఒకేసారి కోతకు రావడం, ధాన్యం తూకం, రవాణా విషయంలో రైతులు అధికారులకు పూర్తి సహకారం అందించాలి.

– శ్వేతా కుమారి, ఏఓ, కొల్చారం

అమరుల త్యాగాలు మరువలేం

ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి



అమర వీరులకు నివాళి అర్పిస్తున్న పోలీసులు

పాపన్నపేట(మెదక్): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేమని పాపన్నపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాపన్నపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో గల అమర వీరుల స్థూపం వద్ద పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు కలసి నివాళులు, గౌరవ వందనం అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 సెప్టెంబర్ 1999 రాత్రి పాపన్నపేట పోలీస్‌స్టేషన్లో విధినిర్వహణలో ఉన్న రఘునందన్, ఆబిద్‌హుస్సేన్, ప్రసాద్, నర్సింలు, రాంచందర్‌లను పీపుల్స్‌వార్ నక్సలైట్లు కాల్చి చంపిన ఘటన ఇప్పటికీ మరువలేక పోతున్నామన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ప్రజల కోసం తమ ప్రాణాలను బలివ్వడానికైనా పోలీసులు వెనుకాడబోరని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ గాలయ్య, పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల పాల్గొన్నారు.

బాల సుబ్రహ్మణ్యం విగ్రహానికి నివాళి..

తూప్రాన్: పట్టణంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన డీఎస్పీ బాల సుబ్రమణ్యం విగ్రహానికి తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్‌ఐ శివానందం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 20 ఏళ్ల క్రితం శివ్వంపేట మండలం పిల్లుట్ల వద్ద అటవీ ప్రాంతంలో నక్సల్స్ పేల్చిన బాంబు బ్లాస్టింగ్‌లో బాలసుబ్రమణ్యంతో పాటు మరి కొందరు పోలీసులు అమరులైన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా ప్రతినిధుల ఎంపిక



నియామక పత్రం అందజేస్తున్న గడ్డం శ్రీనివాస్

రామాయంపేట(మెదక్): బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చింతల శేఖర్, జిల్లా అధికార ప్రతినిధిగా పోలీస్ దేవేందర్ ఎంపికయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ శనివారం వారికి నియామక పత్రాలు అందజేశారు. వారంతా పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని చెప్పారు. జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, అసెంబ్లీ మాజీ కన్వీనర్ వెల్మల సిద్దరాంలు, పార్టీ రామాయంపేట మండల అధ్యక్షుడు దయానందరెడ్డి, మండల ఇన్‌చార్జి తీగల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణ తెలిపారు. శనివారం రాత్రి గవ్వలపల్లి చౌరస్తా నుంచి ఖాజాపూర్ తండాకు చెందిన ధరావత్ శ్రీకాంత్ మద్యం బాటిళ్లతో ఆటో కోస చూస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు.

సభ్యుల సహకారంతో సంఘం అభివృద్ధి



బోనస్ అందజేస్తున్న జితేందర్‌రెడ్డి

కొల్చారం(నర్సాపూర్): రైతు సహకార సంఘం అభివృద్ధికి సభ్యుల సహకారం అవసరమని మండలంలోని సంగాయిపేట మంజీరా వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సంఘం చైర్మన్ జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సంఘం భవనం ఆవరణలో 2023 మార్చ్ 31 వరకు సభ్యత్వం పొందిన సంఘం సభ్యులకు దసరా బోనస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు బోనాల సందడి



చిన్నశంకరంపేట(మెదక్): స్థానిక మండపం వద్ద హోమం నిర్వహిస్తున్న భక్తులు

జిల్లా వ్యాప్తంగా దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శనివారం భక్తులు అమ్మవారికి బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు.



చిలప్‌చెడ్: అజ్జమర్రిలో దుర్గాదేవికి బోనాలు..



కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో...



చేగుంట(తూప్రాన్): ఇబ్రహీంపూర్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న కిషన్‌రావ్



కొల్చారం(నర్సాపూర్): కొల్చారంలో దుర్గామాత సేవలో ఆవుల రాజిరెడ్డి



పెద్దశంకరంపేట(మెదక్): రామోజిపల్లిలో అమ్మవారికి పూజ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్



పాపన్నపేట(మెదక్): పూజలు అందుకుంటున్న దుర్గమ్మ

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో...



నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ శివాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చిలప్ చెడ్(నర్సాపూర్): అంతారంలో సద్దుల బతుకమ్మ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమైన సద్దుల బతుకమ్మ పండుగను ఆయా మండలాల్లో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే గునుగు, బంతి, తంగేడు తదితర పూలను తీసుకువచ్చి అందంగా బతుకమ్మలను పేర్చారు. పట్టంలోని ప్రధాన వీధుల్లో కూడలి వద్ద ఆడ పడుచులు ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ ఆటలు ఆడారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ బతుకమ్మను కొలిచి చెరువుల్లో నిమజ్జనం చేశారు.



కౌడిపల్లి: రాజిపేటలో సద్దుల బతుకమ్మ పండుగ



నర్సాపూర్‌లో బతుకమ్మలకు పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు



అల్లాదుర్గం(మెదక్): చిల్వేరలో ..



శివ్వంపేట (నర్సాపూర్)లో...



హవేళిఘణాపూర్(మెదక్): తొగుటలో..



మనోహరబాద్(తూప్రాన్): గౌతోజీగూడెంలో...

రూ.10 వేల ఆర్థిక సాయం

రామాయంపేట(మెదక్): ఇటీవల చెందిన ఆర్ వెంకటాపూర్ గ్రామానికి చెందిన బాలమల్లు మృతి చెందాడు. బాధిత కుటుంబానికి సంఘ సేవకుడు వెంకుగారి రాజిరెడ్డి శనివారం పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆ కుటుంబాన్ని అన్నిరకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎప్పుడు ఏ సాయం కావలన్నా అందజేస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి రావలసిన పరిహారం అందేలా చూస్తామని చెప్పారు.

పండుగ పూట.. నీటికి కటకట



నర్సాపూర్: పండుగ పూటకూడా నల్లాల ద్వారా తాగునీరు సరఫరా కావడం లేదు. మరమ్మతుల పేరిట రోజుల తరబడి నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తాగు నీటి కోసం కటకటలాడుతున్నారు. రెండు రోజులుగా నల్లాల నుంచి నీరు రావడంలేదని, పట్టణంలోని పలు వార్డులలో నీటి సరఫరా సక్రమంగా జరగడంలేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మరమ్మతుల పేరిట రోజుల తరబడి నీటి సరఫరా నిలిపివేయడం దారుణం అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సరఫరాను సక్రమంగా చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ డీఈఈ కిషన్‌ను వివరణ కోరగా చక్రియాల నీటి ఎత్తిపోతల వద్ద పైపులైనుకు మరమ్మతుల కోసం రెండు రోజుల పాటు నీటి సరఫరాను సంబధిత అధికారులు నిలిపివేశారని చెప్పారు. మరమ్మతుల అనంతరం మరో చోట పైపులైను చెడిపోవడంతో నీటి సరఫరా మరింత ఆలస్యం అయిందని, ఆదివారం నుంచి తాగు నీటి సరఫరా సక్రమంగా జరుగుతుందని స్పష్టం చేశారు.